



జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, బ్యాంకు ఉన్నతాధికారులు

సెక్యూరిటీ సిబ్బందికి అందని జీతాలు

- జిజిహెచ్ పాత ఏజెన్సీ స్థానంలో కొత్త ఏజెన్సీ ఒప్పందం
- గత రెండు నెలల జీతాలు అందక ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ, రీజినల్ ఐ హాస్పిటల్, స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల భద్రత విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు చెల్లించడంలో ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత నెల వరకు ఉన్న ఎక్స్‌ఫర్ట్ కంపెనీ సిబ్బందికి మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి జీతాలు చెల్లించలేదు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతూ అలాగే విధులు నిర్వహిస్తున్నరు. అయితే ఈ నెల 2 నుండి సెక్యూరిటీ నిర్వహణ కంపెనీ మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ అండర్ సొల్యూషన్ కంపెనీతో ఎంఒయు కుదుర్చుకుంది. దీంతో సెక్యూరిటీ నిర్వహణ బాధ్యతలు ప్రస్తుతం ఈ కంపెనీలో నిర్వహిస్తోంది. అయితే సెక్యూరిటీ సిబ్బందికి పాత కంపెనీ నుండి ఇంకా రెండు నెలల జీతాలు రావాల్సి ఉంది.

కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ, రీజినల్ ఐ హాస్పిటల్, స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ భద్రత కోసం సెక్యూరిటీ సిబ్బందిని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగిస్తారు. ఈ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్దతిలో సిబ్బందిని ఏజెన్సీ నియమించుకుని వీటి భద్రత ఏర్పాట్లు చూస్తుంది. సెక్యూరిటీ సిబ్బంది జీతభత్యాలు అన్నింటిని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఏజెన్సీనే నిర్వహిస్తుంది. ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ, హాస్టల్స్, రీజనల్ ఐ హాస్పిటల్, స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భద్రత కోసం సుమారు 276 మంది సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు. గతంలో వీరి నిర్వహణ ఎక్స్‌ఫర్ట్ కంపెనీ నిర్వహించేది. పాత ఏజెన్సీ వారి కాలపరిమితి ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల రెండవ తేదీన ఈగల్ అండర్ సొల్యూషన్ లిమిటెడ్ కంపెనీతో ఎంఒయు చేసుకుంది. ఈ నెల 2 నుంచి ఈగల్ అండర్ సొల్యూషన్ కంపెనీ సెక్యూరిటీ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తుంది. పాత ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ సెక్యూరిటీ సిబ్బందికి సుమారు మూడు నెలల వేతనాలను పెండింగ్ పెట్టినట్లు సమాచారం.



హ్యాండ్ ఓవర్ చేయని పాత ఏజెన్సీ

పాత ఏజెన్సీ ఎక్స్‌ఫర్ట్ కంపెనీకి కాంట్రాక్ట్ ఒప్పందం కుదరకపోవడంతో కొత్త ఏజెన్సీకి ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఏరియా ఎంత విస్తీర్ణంలో ఉంది, బిల్డింగ్ ప్లాన్స్, ఫైర్ అలారమ్స్, ఫైర్ ఎస్టిమేషన్, సెక్యూరిటీ సిబ్బంది ఎవరెవరు డ్యూటీలో వున్నారు, వారిని ఎక్కడెక్కడ కేటాయించాలి, అవుట్ ఇన్‌గేట్స్ ఏవి, సెక్యూరిటీ సిబ్బంది పిఎఫ్, ఇఎస్ఐ నెంబర్లు, పోలీసు వెరిఫికేషన్, హెల్త్ అప్‌డేట్స్, లీవ్, ఆఫ్‌లు ఎవరెవరు తీసుకున్నారు వంటి సమాచారాన్ని పాత ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ కొత్త ఈగల్ సొల్యూషన్ ఏజెన్సీకి హ్యాండ్ ఓవర్ చేయాల్సి ఉండగా వాటిని ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. పాత ఏజెన్సీ సెక్యూరిటీ సిబ్బందికి మూడు నెలలు జీతాలు పెండింగ్ పెట్టగా ఒక నెల జీతం ప్రస్తుతం యిచ్చింది. మరో రెండు నెలలు జీతాలు ఇవ్వలేదని, వాటిని త్వరగా చెల్లించాలని సిబ్బంది కోరుతున్నారు. పాత ఏజెన్సీ సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు పిఎఫ్, ఇఎస్ఐ విషయంలో సక్రమంగా నిర్వర్తించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తించే కొత్త ఏజెన్సీ సెక్యూరిటీ సిబ్బందికి ఇవ్వాల్సిన జీతభత్యాలు, డ్రస్సు, బూట్లు, వంటి మెటీరియల్స్ ఇచ్చి సక్రమంగా విధులు నిర్వహించాలని ప్రజా సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

పాత ఏజెన్సీ పెట్టిన పెండింగ్ జీతాలు ఇప్పిస్తాం



పాత ఏజెన్సీ యాజమాన్యంతో మాట్లాడి మార్చి నెల వేతనాలను వేయించాం. మిగిలిన రెండు నెలలు, ఏప్రిల్, మే నెల వేతనాల బిల్లులు చేసి పంపించాం. బడ్జెట్ వచ్చిన వెంటనే పాత ఏజెన్సీ బిల్లు పడతాయి. వారే సెక్యూరిటీ సిబ్బందికి జీతాలను చెల్లిస్తారు. జూన్ నెల నుండి కొత్త ఏజెన్సీ బాధ్యత.

- డాక్టర్ వెంకటేశ్వర్లు, జిజిహెచ్ సూపరింటెండెంట్.

కొత్త ఏజెన్సీ యాజమాన్యం సిబ్బంది పట్ల బాధ్యతగా వ్యవహరించాలి



సెక్యూరిటీ సిబ్బందికి పాత ఏజెన్సీ జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐ విషయంలో సక్రమంగా వ్యవహరించలేదు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఈగల్ ఏజెన్సీ సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించి వారికి ఇవ్వాల్సిన డ్రస్సు, బూట్లు వంటివి ఇవ్వాలి.

- విజయ రామాంజనేయులు, సిఐటియు కర్నూలు నగర కార్యదర్శి.

రైతులకు విరివిగా పంట రుణాలివ్వాలి

- వార్షిక రుణ ప్రణాళిక రూ.17,402.86 కోట్లు : కలెక్టర్ పి రంజిత్ భాష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈ ఏడాది రైతులకు పంట రుణాలు బ్యాంకర్లు విరివిగా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాసా బ్యాంకు ఉన్నతాధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది 2025-26 వార్షిక రుణ ప్రణాళిక రూ.17,402.86 కోట్లు రుణాల మంజూరుకు జిల్లా బ్యాంకర్ల కమిటీ ఆమోదముద్ర వేసింది. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష అధ్యక్షతన జరిగిన సమావేశంలో వార్షిక ప్రణాళికను విడుదలను చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ ఈ ఏడాది లక్ష్యం రూ.17402.86 కోట్లు అని, ఇది గత సంవత్సరంతో పోల్చుకుంటే 15.49 శాతం ఎక్కువగా ఉందన్నారు. మొత్తం వ్యవసాయ రుణాలు రూ.6,162.06 కోట్లు కాగా, అందులో ఖరీఫ్ వ్యవసాయ రుణాలు రూ.3635.62 కోట్లు, రబీ వ్యవసాయ రుణాలు రూ.2526.44 కోట్లు అన్నారు. వ్యవసాయ కాల రుణాలు రూ.2202.54 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.39.24 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రూ. 560.38 కోట్లు మొత్తం వ్యవసాయ రంగానికి రుణ లక్ష్యం రూ. 8964.22 కోట్లు అని, ఇది మొత్తం రుణ లక్ష్యంలో 51.51 శాతంగా ఉంద న్నారు. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు అన్ని ప్రాధాన్యతా రంగాల్లో బ్యాంకర్లు కేటాయించిన లక్ష్యాలను సాధించారని అభినందించారు. ఎంఎస్ఎంఈ, హౌసింగ్, విద్య, స్టాండ్ అప్ ఇండియా లోన్లు ఇవ్వడంలో మాత్రం బ్యాంక్‌లు వెనుకబడి ఉన్నాయని చెప్పారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు విరివిగా పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. ఆలూరు, ఆస్పరి, పత్తికొండ ప్రాంతాల్లో పలు సోలార్, విండ్ ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. ఈ రంగంలో రుణాల మంజూరుపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎల్‌డిఎం రామచంద్ర రావు జిల్లాలో గత ఏడాది బ్యాంకర్లు సాధించిన లక్ష్యాలను వివరించారు. సమావేశంలో కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, నాబార్డ్ డిడిఎం సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, మెప్మా పిడి నాగ శివ లీల, ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజా మహేంద్ర నాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెల్లార్‌లో స్కూల్ నిర్వహణ చట్ట విరుద్ధం

- శ్రీ చైతన్య క్రీడో పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు అబూబకర్

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

కర్నూల్ నగరంలో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌లో స్కూల్ నడుపుతున్న శ్రీ చైతన్య క్రీడో పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు అబూబకర్ డిమాండ్ చేశారు. గురువారం కర్నూల్ నగరంలోని సెంటర్ ప్లాజా సెల్లార్‌లో నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు అబూబకర్ మాట్లాడుతూ సెంట్రల్ ప్లాజా భవనంలోని సెల్లార్‌లో విద్యార్థులకు పాఠాలు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెంటర్ ప్లాజా బిల్డింగ్ పాత బడిందని, పై కప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని, విద్యార్థులకు సరైన గాలి, వెలుతురు లేదన్నారు. కనీస వసతులు, సౌకర్యాలు లేని ప్రదేశంలో పాఠశాలను నిర్వహిస్తున్న యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవా లన్నారు. యాజమాన్యానికి ఫీజుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ విద్యార్థులకు వసతులు కల్పించడంలో లేదన్నారు. అలాగే కర్నూలు నగరంలో అనేక కార్పొరేట్ విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న విద్యా సంస్థలను గుర్తించి వెంటనే గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ పాఠశాలల్లో అధిక ఫీజులు, బుక్కులు, యూనిఫాం పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారన్నారు. తక్షణమే విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, నగర సహాయ కార్యదర్శి పృథ్వి, నగర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిద్దుదాం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిద్దుదామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని రాజ్ విహార్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, డిఐజి కోయ ప్రవీణ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నగర మేయర్ బి.వై.రామయ్య, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియం లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాసా మాట్లాడారు. దేశంలో మాదక ద్రవ్యాలు ఉండకూడదనే నేపథ్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో మాదక ద్రవ్యాలను నియంత్రించడానికి అనేక కార్యక్రమాల ద్వారా ప్రజలలో అవగాహన కలిగిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌కు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఏ వ్యక్తి అయినా చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలకు బానిసైతే తన ఎదుగుదలకు తానే అడ్డుకట్టు వేసుకోవడంతో పాటు ఆర్థికంగా, మానసికంగా, కుటుంబ బంధాలకు దూరమయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు విద్యార్థి దశ నుండే అవగాహన కల్పించడానికి ప్రతి పాఠశాలలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. అలాగే యువత ఫోన్స్, ట్యాబ్స్‌కు అలవాటు పడి చెడు అలవాట్లుకు బానిసవుతున్నారన్నారు. పెద్దలు చెప్పిన మాటలు విని సమాజానికి ఉపయోపడే పనులు చేసేలా చూడాలన్నారు. పాఠశాలలు, కళాశాలలో ఉపాధ్యాయులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సూచనలు, వీడియోలు ప్రదర్శించాలన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

క్లస్టర్ యూనివర్శిటీలో.. : యువత మాదకద్రవ్య వినియోగం, అక్రమ రవాణాకు దూరంగా ఉండాలని, అప్పుడే అన్ని విధాల అభివృద్ధి చెందుతారని రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. క్లస్టర్ యూనివర్సిటీలో అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, బోధ నేతర సిబ్బందితో డ్రగ్స్ జోలికి వెళ్ళమని ప్రతిజ్ఞ చేయించారు. సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాస్ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ హెచ్. అక్తర్ భాను వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, క్లస్టర్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ నాగరాజ్ శెట్టి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బి. అనూష, డాక్టర్ వినోలియా, హరీష్ కుమార్, అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో : రాయలసీమ వర్సిటీలో సమావేశ భవనంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ వి.వెంకట బసవరావు మాట్లాడుతూ నేటితరం యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయ్ కుమార్ నాయుడు, వర్సిటీ సిడిసి డీన్ పివి. సుందరానంద్, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఆర్. భరత్ కుమార్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కట్టమంచి రామలింగారెడ్డి పాఠశాలలో.. నగరంలోని స్థానిక కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ స్మారక పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి వివరించారు. అలాగే బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ యస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యం వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, డిఐజి కోయ ప్రవీణ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నగర మేయర్ బి.వై.రామయ్య, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి తదవితరులు



కాలనీల్లో పర్యటిస్తున్న నాయకులు

కాలువలు, రోడ్లు అపరిశుభ్రం : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని సప్తగిరి నగర్, ఆదిత్య నగర్ కాలనీల్లో రోడ్లు, కాలువలను శుభ్రం చేయ కుండా కార్మికులు నిర్లక్ష్యంగా ఉన్నారని సిపిఎం నగర కమిటీ సభ్యులు ఆర్.కృష్ణ, సోల్మన్ రాజు తెలిపారు. గురువారం వారు ఆయా కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోడ్లపై నీళ్లు, చెత్తాచెదారం చేరి కాలనీ ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దోమలు, దుర్వాసనతో చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. మున్సిపల్ అధికారులు, కమిషనర్ తగినంత సిబ్బందిని పెట్టకుండా వారానికి, రెండు వారాలకు ఒకసారి కాలువలు తీయిస్తున్నారని విమర్శించారు. కాలువలు నిండిపోయి రోడ్లపైకి మురుగునీరు వస్తోందని తెలిపారు. రోడ్లు, కాలువలను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే 17వ వార్డు ప్రజలును సమీకరించి కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు బాష, మద్దిలేటి పాల్గొన్నారు.

వాడుకలోకి కుర్చీలు...

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా బస్ స్టేషన్‌కు ఒక్కో కుర్చీలో ముగ్గురు కూర్చునే వీలున్న 25 కుర్చీలు (3-సీటర్) కేంద్ర కార్యాలయం ద్వారా మంజూరయ్యాయి. వాటిని గురువారం కర్నూలు ఇన్‌ఛార్జి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సుధారాణి ఆధ్వర్యంలో బస్టాండులో ఉన్న సీనియర్ సిటిజన్లు, కర్నూలు జిల్లా సి.బెళగల్ వాస్తవ్యులు టీచర్ అనుమన్న, కర్నూలుకు చెందిన వ్యాపార వేత్త సుబ్బారావు చేతుల మీదుగా వాడుకలోకి తీసుకొచ్చారు. కర్నూలు-2 డిపో మేనేజర్ శర్మ, కర్నూలు-1 అసిస్టెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, బస్ స్టేషన్ మేనేజర్ కాంచన పాల్గొన్నారు.

జిజిహెచ్‌కు మూడు ఏసీలు

- మెడికవర్ హాస్పిటల్ విరాళం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వా స్పత్రికి మెడికవర్ హాస్పిటల్ వారు మూడు ఎయిర్ కండిషనర్లను గురువారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఆస్పత్రికి విరాళం ఇచ్చిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మెడికవర్ మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్వర్ రెడ్డి, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నగాంజన్ పాల్గొన్నారు.




ఏసీలను అందజేస్తున్న మహేశ్వర్ రెడ్డి

పోరాటాల ఫలితమే...

- ఎనర్జీ అసిస్టెంట్ల బదిలీల గైడ్‌లైన్స్ రద్దు
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పోరాటాల ఫలితంగానే ఎనర్జీ అసిస్టెంట్ల బదిలీల గైడ్ లైన్స్ రద్దు చేసినట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు తెలిపారు. గురువారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా రీజినల్ అధ్యక్షులు అంజిబాబు, ఎపి ఎస్‌పిడిసిఎల్ కంపెనీ కమిటీ ఉపాధ్యక్షులు పి.నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ... అసిస్టెంట్ (జూనియర్ లైన్ మెన్ గ్రేడ్-2) బదిలీలపై ఎపిఈపిడిసిఎల్ యాజమాన్యం ఇచ్చిన గైడ్ లైన్స్ రద్దు చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గైడ్ లైన్స్ రద్దు చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 7,529 మంది ఎనర్జీ అసిస్టెంట్లను నియమించినట్లు తెలిపారు. వీరంతా గ్రామ సచివాలయంలో పని చేస్తున్నారని, ఎనర్జీ అసిస్టెంట్ బదిలీలను గ్రామ సచివాలయం గైడ్‌లైన్స్ ప్రకారం కాకుండా విద్యుత్ శాఖ బదిలీల నిబంధన ప్రకారమే చేపట్టాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు, విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీర్లకు వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించి గ్రామ సచివాలయం నిబంధన ప్రకారం బదిలీలు చేయాలని ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసిందని గుర్తు చేశారు. ఎనర్జీ అసిస్టెంట్ బదిలీలను విద్యుత్ శాఖ నిబంధన ప్రకారం చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలే ఏకైక మార్గమని తెలిపారు.




మాట్లాడుతున్న నాయకులు

కళ్లు ఎంతో కీలకం

- పుట్టినరోజు సందర్భంగా కంటి అద్దాలు పంపిణీ చేసిన సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మానవ శరీరంలో కళ్లు ఎంతో ముఖ్యమైవని, వాటి సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని సమాజ సేవకులు, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్, ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మీడియా రూమ్‌లో జర్నలిస్టులకు, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన పుట్టినరోజు సందర్భంగా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. సమాజంలో ఎంతోమంది కంటి చూపు లేక బాధపడుతున్నారని, రానున్న రోజుల్లో శాస్త్రవేత్తల కృషితో కంటిచూపు లభించే అవకాశాలు రావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ తమ సంపదలో ఎంతో కొంత సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. అనంతరం ఆయన కేక్ కట్ చేశారు. సీనియర్ జర్నలిస్టు మీసాల రామస్వామి పాల్గొన్నారు.



డాక్టర్ శంకర్ శర్మను సన్మానిస్తున్న సిబ్బంది

ఆర్‌పిగా షబీరా భానును కొనసాగించాలి

- సిపిఎం నగర కార్యదర్శి రాముడు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ముజఫర్ నగర్ రమా ఐక్య సంఘంలో గత రెండున్నర ఏళ్లుగా ఆర్‌పిగా పనిచేస్తున్న ఎస్.షబీరా భానును కొనసాగించాలని సిపిఎం నాయకులు కోరారు. గురువారం మెప్మా ఐబి మురళీని సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయిబాబా, ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప, ఆర్‌పిల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఉమా దేవి, నగర అధ్యక్షులు పి.రుద్రమ్మ, రమా ఐక్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శారదమ్మ, కె.సువార్త కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాముడు, సాయిబాబా మాట్లాడారు. రమా ఐక్య సంఘంలో పొదుపు సంఘాల సభ్యులు కట్టిన డబ్బులను సొంతానికి వాడుకోవడం వల్ల పాత ఆర్‌పిని తొలగించి తీర్మానం చేసినట్లు తెలిపారు. 2023 జనవరిలో రమా ఐక్య సంఘం కొత్త ఆర్‌పిగా షబీరాభానును నియమిస్తూ ఐక్య సంఘం తీర్మానం చేసిందని చెప్పారు. అప్పటి నుంచి ఎలాంటి జీతం లేకుండా ఆర్‌పిగా పనిచేస్తున్నారని తెలిపారు. ఐక్య సంఘం తీర్మాణం ప్రకారం ఆర్‌పిగా ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ప్రాజెక్టు డైరెక్టర్, సిఎంఎం, సిఇఒలను, కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. 'ఆన్‌లైన్ ఓపెన్ కాలేదు.. ఆన్‌లైన్ ఓపెన్ అయిన వెంటనే ఆర్‌పిగా ఎక్కిస్తామ'ని అధికారులు మభ్యపెడుతూ వస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఓపెన్ అయిందని, పాత ఆర్‌పి పేరు ఆన్‌లైన్‌లో వస్తుందని తెలిపారు. అవినీతికి పాల్పడిన పాత ఆర్‌పిని ఎందుకు తొలగించకుండా ఉన్నారని ప్రశ్నించారు. షబీరాభాను పేరును ఆన్‌లైన్‌లో ఎక్కించకుండా అధికారుల నిర్లక్ష్యం చేయడం ఏమిటని నిలదీశారు. ఈ విషయాన్ని విజయవాడలో మెప్మా ప్రధాన కార్యాలయం ఎండి, డైరెక్టర్ ఆది నారాయణను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. పాత ఆర్‌పిని తొలగించాలని ఆయన ఆదేశాలు ఇచ్చినా తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యమని విమర్శించారు. పాత ఆర్‌పిని తొలగించి షబీరాభానును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. లేకపోతే పొదుపు మహిళలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



లబ్ధిదారులకు రేషన్‌ను పంపిణీ చేస్తున్న జెసి

వృద్ధులు, వికలాంగులకు రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - పత్తికొండ

పట్టణంలో జెసి డాక్టర్ బి.నవ్య చేతుల మీదుగా వృద్ధులు, వికలాంగులకు గురువారం రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ సంస్కరణల్లో భాగంగా ప్రతినెలా పంపిణీ చేసే రేషన్‌ను 26 నుంచి 30లోపు.. ఐదు రోజులు ముందుగానే వృద్ధులు, వికలాంగులకు వారి ఇళ్ల దగ్గరకు వెళ్లి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆర్‌డిఒ భరత్ నాయక్ ఉన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సిఐటియు ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కార్మికులను బాని సలుగా మార్చే కార్మిక కోడ్లను రద్దు చేయాలని, జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు కోరారు. గురువారం సూర్జిత్ భవన్‌లో సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయ రామాంజనేయులు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల మధ్య కుల, మత భేదాభిప్రాయాలను సృష్టిస్తూ దేశ ఐక్యతను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్లకు ప్రభుత్వ సంస్థలను అప్పజెప్పడమే కాకుండా ప్రజలపై అనేక రకాల భారాలు వేస్తూ ప్రజలను అప్పులపాలు చేస్తూ మానసిక ధైర్యాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు. జులై 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు నగర ఆఫీస్ బేరర్స్ నాగస్వాములు, మైమూద్, ఖాజా పాషా, రామకృష్ణ, సోలమన్ రాజు, రాంబాబు, కుమార్, మాసుం, మద్దిలేటి, షేక్షా, చిన్న చెన్నుడు, అయ్యన్న, నాగరాజు, విశ్వాస్, బజారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తెర్నేకల్‌లో ప్రభుత్వాస్పత్రి నిర్మాణ పనులు

ప్రజాశక్తి- దేవనకొండ


పనుల కోసం మార్కింగ్ ఇస్తున్న డిఇ శివరుద్ర

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న 30 పడకల ప్రభుత్వాస్పత్రి పనులకు గురువారం డివిజనల్ ఇంజినీర్ శివరుద్ర, జెఇ సునీల్ మార్కింగ్ ఇచ్చారు. ఆ పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంజినీర్లు మాట్లాడారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూటమి నాయకులు మాజీ ఎంపిటిసి నాగేష్, చిన్న రాముడు, తిమ్మప్ప, లక్ష్మన్న, బడేసా, బంగి చంటి, జాన్సన్ బాబు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

- 12 మందికి రూ.9.84 లక్షలు


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బాధితులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి పంపిణీ చేశారు. గురువారం నందవరం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల మండలాలకు చెందిన 12 మంది బాధితులకు మంజూరైన రూ.9.84 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. వైద్యానికైన ఖర్చులు చెల్లించి ఆర్థిక ఉపశమనం కలిగించారంటూ బాధితులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

కోనేరు తీరుపై టిడిపి మండిపాటు


నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి పట్ల మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్ తీరుపై టిడిపి మండల నాయకులు మండి పడ్డారు. ఎమ్మెల్యే బీవీపై కోనేరు వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం గోనెగండ్లలోని టిడిపి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీపై కోనేరు నాగేంద్రప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు, తప్పుడు ప్రకటనలు మానుకోవాలని తెలిపారు. లేకపోతే ప్రజలు, టిడిపి కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎమ్మెల్యే మంచితనం, సహనం వల్లే ఇప్పటి వరకు కోనేరుపై చర్యలు చేపట్టడం లేదన్నారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే వైసిపి అధినేత జగన్ అరాచకాలను ప్రజలకు తెలియజేయాలని సవాలు విసిరారు. టిడిపి నాయకులు తిరుపతయ్య నాయుడు, బేతాళ బడేసా, టౌన్ ప్రెసిడెంట్ రహమతుల్లా, రంగస్వామి నాయుడు, కాంట్రాక్టర్ షేక్షావలీ, పూజారి చంద్రశేఖర్, మదీనా, అచ్చుగట్ల ఫక్రుద్దీన్, జిలాని, కొత్తింటి ఫక్రుద్దీన్, కులుమాల రాముడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - చిప్పగిరి


ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

గ్రామంలో ప్రశాంతంగా జీవించాలని, ఏ ఒక్కరూ తగాదాలు, సమస్యలు తెచ్చుకోకుండా జీవించాలని ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు ప్రజలకు తెలిపారు. గురువారం దౌల్తాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు, మహిళలకు, ప్రజలకు సైబర్ నేరాలు, గ్రామంలో తలెత్తుతున్న తగాదాలపై కొన్ని సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ... పనులు విడిచిపెట్టి సమస్యలు తెచ్చుకోవద్దని సూచించారు. కొత్త నెంబర్ల నుంచి ఫోన్ చేసి 'మీకు ఒటిపి వస్తుంది. చెప్పాలని' అన్నప్పుడు పొరపాటు చేయవద్దన్నారు. ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎపిఒ జుబేర్ అహ్మద్, టెక్నికల్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

టిడిపి కంచుకోటకు బీటలు..?

- ఒకరు రాజీనామా.. మరొకరు రాజీనామా ప్రకటన - పార్టీలో కలవరం - దేశాయ్ గ్రూపు వైపు ఇతర పార్టీల చూపు..?

ప్రజాశక్తి - నందవరం


మాధవరావు దేశాయ్


గురురాజ్ దేశాయ్

టిడిపి కంచుకోటకు బీటలు వారుతోంది. మండలంలో ఒక నాయకుడు రాజీనామా చేయగా.. మరో నాయకుడు రాజీనామా చేస్తానని ప్రకటన చేశారు. పార్టీలో కలవరం నెలకొంది. నందవరం గ్రామం టిడిపిలో గందరగోళం ఏర్పడింది. ముఖ్య నాయకులు గురురాజు దేశాయ్ టిడిపికి రాజీనామా చేశారు. టిడిపి సీనియర్ నాయకులు మాధవరావు దేశాయ్ రాజీనామా చేస్తానని ప్రకటించడం టిడిపి శ్రేణులను కలవరపెడుతోంది. ఇదే అవకాశంగా భావించిన పలు పార్టీలు దేశాయ్ గ్రూపునకు వల విసురుతున్నట్లు సమాచారం.

నందవరంలో దేశాయ్ గ్రూపు చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. పార్టీలో సరైన గుర్తింపు లేదని కొద్ది రోజుల క్రితం మాధవరావు దేశాయ్ బహిరంగంగా బాధను వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి కష్టపడినా గుర్తించడం లేదని ఆవేదన చెందారు. ఇదే అదునుగా పలు పార్టీలు ఆయన వైపు చూస్తున్నాయని సమాచారం. టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్ ఇటీవల టిడిపికి రాజీనామా చేయడం మండల ప్రజలను, రాజకీయ నాయకులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఆయన మాత్రం వ్యక్తిగత కారణాల వల్ల పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. పార్టీలో ఆయనకు సరయిన గుర్తింపు ఇవ్వడం లేదని, అందుకే ఆయన బయటికి చెప్పుకోలేక పార్టీ నుంచి బయటకొచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. గురురాజ్ దేశాయ్ రాజీనామాతో గ్రామంలో టిడిపికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కార్యకర్తలు వాపోతున్నారు. మాధవరావు దేశాయ్ రాజీనామా చేస్తే స్థానిక ఎన్నికలు సర్పంచి, ఎంపిటిసిలో గ్రామంలో టిడిపికి ఎదురుగాలి వీచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

టిడిపి కంచుకోటకు బీటలు

టిడిపికి కంచుకోటగా ఉన్న కోట వీధిలో ఈసారి బీటలు వారే ప్రమాదం ఉందని కార్యకర్తలు భావిస్తున్నారు. కోట వీధి అంటేనే టిడిపి అనేలా ఉంది. గత సర్పంచి ఎన్నికల్లో గ్రామంలో 14 వార్డుల్లో 'ఫ్యాన్' గాలి వీచినా కోట వీధిలో మాత్రం 'ఫ్యాన్' గాలి సోకలేదు. 7వ వార్డులో కూడా టిడిపి గెలుపొందింది. కొన్నేళ్లుగా వైసిపికి కంచుకోటగా ఉన్న దళిత వార్డులో దేశాయ్‌లు పోరాటం చేసి ఎంపిటిసి గెలిపించిన ఘనత ఉంది. గతంలో ఆ వార్డులో టిడిపికి కేవలం 50, 60 ఓట్లు మాత్రమే వచ్చేవని, వీరిద్దరి పోరాటం వల్ల ఆ కాలనీలో టిడిపి పుంజుకొని ఇతర పార్టీలతో 'నువ్వా.. నేనా' అన్న విధంగా పార్టీని బలోపేతం చేశారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. 2013లో ఇండిపెండెంట్ సర్పంచిగా తమ అభ్యర్థిని నియమించి గెలిచిన ఘనత దేశాయ్ గ్రూపునకు ఉంది. ఇండిపెండెంట్‌గా గెలిచిన టిడిపితోనే తమ ప్రయాణాన్ని కొనసాగించి టిడిపిపై వారి ప్రేమను చాటుకున్నారని టిడిపి కార్యకర్తలు పేర్కొన్నారు. అలాంటి వ్యక్తుల్లో ఒకరు పార్టీకి దూరం కావడం, మరొకరు దూరమవుతామని ప్రకటించడం టిడిపికి గట్టి షాక్ అని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మండలంలో జరుగుతున్న ఈ రాజకీయ పరిణామాలను జిల్లా కేడర్, అధిష్టానం గమనించిందా..? ఈ రాజకీయ పరిణామాలపై అధిష్ఠానం ఎలా స్పందిస్తుందోనని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. గ్రామంలో కాకుండా మండల రాజకీయాలపై కూడా వీరి ప్రభావం పడే అవకాశం ఉందని, వీరి అభిమానులు, కార్యకర్తలు, దేశాయ్ నెట్‌వర్క్ అసోసియేషన్ సభ్యులు వేల సంఖ్యలో ఉన్నారని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

దేశాయ్ గ్రూపు వైపు ఇతర పార్టీల చూపు..?

మాధవరావు దేశాయ్, గురురాజ్ దేశాయ్‌కి గ్రామంలో ఉన్న రాజకీయ పట్టు అందరికీ తెలిసిందే. అదే అదునుగా పలు పార్టీలు వారికి వల వేస్తున్నట్లు సమాచారం. వీరిని తమ పార్టీలో చేర్చుకొని మండలంలో తమ పార్టీని బలోపేతం చేసుకోవాలని కొన్ని పార్టీలు భావిస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే గురురాజ్ దేశాయ్ వేరే పార్టీలోకి వెళ్తున్నట్లు వినికిడి. ఆయనతో ఇప్పటికే జిల్లాస్థాయి నాయకులు ఫోన్ ద్వారా మాట్లాడినట్లు కార్యకర్తలు చెప్పుకొచ్చారు. ఆయన జనసేన, బిజెపి.. ఏ పార్టీలో చేరుతారోనని గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. మాధవరావు దేశాయ్ వైపు కూడా పార్టీలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఆయన కూడా పార్టీ మారితే టిడిపి కేడర్ దెబ్బతినే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

- జడ్జి శ్రీవల్లి

ప్రజాశక్తి - ఆదోని

యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆదర్శవంతమైన జీవితం అలవర్చుకోవాలని, మత్తుకు బానిసలు కావొద్దని జడ్జి శ్రీవల్లి తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యం అక్రమ సరఫరా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ఆదోనిలోని నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ సంగటి దేవదానం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకుముందు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత కలిగి మాదక ద్రవ్యం (డ్రగ్స్) వాడకం, అక్రమ సరఫరాను వ్యతిరేకించాలని కోరారు. ఆరోగ్యం, కుటుంబం, సమాజాన్ని రక్షించాలని తెలిపారు. ప్రిన్సిపల్ అబ్దుల్ బాషా, సౌజన్య, ప్రీతి, సోనీ, దినకర్, ప్రవీణ్ కుమార్, డాక్టర్ సలోమి, డాక్టర్ ఖాలిక్, విజయకుమారి, బార్ అసోసియేషన్ నాయకులు మమత, లోకేష్, బాలకృష్ణ, నాగరాజు, శ్రీధర్ సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి శ్రీవల్లి

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని


ఆదోనిలో ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. గురువారం డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదోని మున్సిపల్ మైదానం నుంచి మున్సిపల్ రోడ్డు మీదుగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ హేమలత, సిఐలు శ్రీరామ్, నల్లప్ప, రాజశేఖర్ రెడ్డి, రామలింగప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డ్రగ్స్, మత్తు మాదక ద్రవ్యాలకు బానిసలై యువత జీవితాన్ని నాశనం చేసుకుంటోందని తెలిపారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి మెరుగైన సమాజం కోసం పాటుపడాలని కోరారు. మత్తుకు అలవాటు పడి విచక్షణ కోల్పోయి అఘాయిత్యాలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుని జైలు పాలు అవుతున్నారని తెలిపారు. యుక్త వయస్సులోనే వ్యసనాలు ఆకర్షిస్తాయని, దూరంగా ఉంటేనే మంచి ప్రవర్తన గల వ్యక్తిగా పరిణితి చెంది సమాజంలో గుర్తింపు పొందుతారని చెప్పారు. ఎస్ఐలు డాక్టర్ నాయక్, రామస్వామి, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సావిత్రి, రాగిణి, వసంత ఉన్నారు. **ఎమ్మిగనూరులో** ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి సోమప్ప సర్కిల్ వరకు సాగిన ర్యాలీలో విద్యార్థులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. డీఎస్పీ ఉపేంద్ర బాబు, పట్టణ సిఐ శ్రీనివాసులు, పట్టణ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. **మంత్రాలయంలో** పోలీసు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి మాట్లాడారు. సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, నాయకులు అశోక్ రెడ్డి, డిసి.తిమ్మప్ప, పవన్ కుమార్, శివ, రాఘన్న, డేవిడ్ రాజు, చేపల నాగేష్, కలుదేవకుంట భీమయ్య పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ


మంత్రాలయంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

ఇంటి పైకప్పును శుభ్రంగా ఉంచుకోవాలి

- కమిషనర్ రవీంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



నగర ప్రజలు ఇళ్లు, భవనాల పైకప్పులను శుభ్రంగా ఉంచుకోవాలని, పైకప్పుల్లో వర్షపునీరు నిలవకుండా చూసుకోవాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సూచించారు. గురువారం ఆయన సచివాలయ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పైకప్పుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల ఆ నీరు లోపలికి వెళ్లి ఐరన్ పాడై పెచ్చులూడతాయని, శ్లాబ్ పటిష్టత దెబ్బ తింటుందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్ని మున్సిపల్, సచివాలయ, పాఠశాల, కమ్యూనిటీ భవనాలపై శుభ్రం చేసేందుకు వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత సిబ్బంది పైకప్పులను శుభ్రం చేసి, నీరు సజావుగా, ఆటంకం లేకుండా సాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కుండలు, ప్లాస్టిక్ బాటిల్ తదితర వాటిల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో వర్షపునీరు వేగంగా బయటకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఇప్పటికే నగర పరిధిలో ప్రధాన డ్రెయినేజీ కాలువల్లో పూడికతీత పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన కొన్ని ప్రాంతాల్లో వారంలోగా పూర్తి చేస్తామని తెలిపారు.

'మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడాలి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మోడీ సర్కార్ ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి.మల్లికార్జున కోరారు. గురువారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా సదస్సు నిర్వహించారు. మల్లికార్జున అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు శేషఫణి, రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మణి మాట్లాడారు. నేడు బిజెపి పాలనలో అంతకుమించి నిర్బంధం అమలు జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడం లేదన్నారు.

డిప్యూటీ ఇఇ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



డిప్యూటీ ఇఇగా వి.గురురాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్పీ కార్యాలయంలో వి.గురురాజు చేపట్టారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రొటెక్షన్ అండ్ టిఆర్‌ఈ కర్నూలుకు కల్యాణదుర్గం నుంచి బదిలీపై వచ్చి చేరారు.



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సిబ్బంది

పాఠశాలలో ఫర్నీచర్ చోరీ

- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో ఫర్నీచర్ దొంగతనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయులు లతీఫ్, ఉపాధ్యాయులు గురువారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంకు ఫిర్యాదు చేశారు. ఈ వారం రోజుల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఫర్నీచర్‌ను, 15 బెంచీలను ఎత్తుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయులు లతీఫ్ తెలిపారు. మిగతా ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారన్నారు. వాచ్‌మేన్ నిర్లక్ష్యపు వైఖరి ఫర్నీచర్ ధ్వంసం కావడానికి కారణమని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారా, ఎత్తుకెళ్లారా, లేదా ఎవరికైనా అమ్మేశారా అన్న కోణాల్లో పలువురు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు లతీఫ్ మాట్లాడుతూ... ఫర్నీచర్ దొంగతనం జరిగిందని తెలుసుకొని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

పత్తి పంటను పరిశీలించిన ఎడిఎ, ఎఒ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని ఎర్రకోట గ్రామంలో పత్తి పంటను గురువారం ఎడిఎ ఎస్.మహ్మద్ ఖాద్రీ, ఎఒ శివ శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుతం పత్తి పంటను పేను బంక, దోమ ఆశించినట్లు తెలిపారు. రసం పీల్చే పురుగుల నివారణకు ప్రొఫినోఫాస్ 2 మిల్లీలీటర్లు లీటర్ నీటికి లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటిలో కలుపుకొని ఆకులు బాగా తడిచేటట్టుగా పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితుల్లో 19:19:19, 5 గ్రాములు లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి నరసింహుడు, రైతులు పాల్గొన్నారు.

రైల్వే పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రైల్వే స్టేషన్ భవనం స్థానంలోనే మరో కొత్త భవనం రూ.9 కోట్లతో నిర్మిస్తున్నారని, పూర్తి నాణ్యతతో నిర్మిస్తే మరో వందేళ్లు ఉపయోగపడే విధంగా ఉండాలని ఎమ్మెల్యే పార్థసారథి సూచించారు. గురువారం ఆదోని రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పనులు పూర్తిగా నాణ్యతతో చేయాలని అక్కడే ఉన్న కాంట్రాక్టర్‌ను సూచించారు. అలాగే ప్రజలకు అందుబాటులో డిజైన్ ఉంచాలని కోరారు. అనంతరం నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులను పలకరించి సమస్యలను తెలుసుకున్నారు. పనులకు సంబంధించిన రికార్డులు చూపాలని రైల్వే ఇంజినీరింగ్ అధికారులను కోరినా లేవని సమాధానం చెప్పడంతో అక్కడున్నవారు అవాక్కయ్యారు.

ఆదోనిలో వందే భారత్ రైలు నిలుపుదలకు కృషి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని మీదుగా బెంగళూరుకు రోజూ వెళ్తున్న వందే భారత్ రైలును ఆదోనిలో నిలుపుదల చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. అలాగే ఇతర రైళ్లు ఆగేవిధంగా రైల్వే శాఖ మంత్రికి లేఖ రాస్తానని పేర్కొన్నారు. స్టేషన్ మేనేజర్ వెంకటేశులు ఉన్నారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - ఆదోని

శ్రీకోట చంద్ర మౌళేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందజేయాలని ఆలయ కమిటీ సభ్యులు రవి కోరారు. ఆలయం అభివృద్ధికి ఆదోనికి చెందిన దాత హనుమంతు ఆలయ కమిటీ సభ్యులకు గురువారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. రవి మాట్లాడుతూ... భక్తుల అభీష్టం మేరకు ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు ఆలయ ఆవరణలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే కొందరు భక్తులు వారికి తోచిన సహాయం చేశారని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో కట్టడాల నిర్మాణం, ఇతర పనులు జరిగాయన్నారు. సదుపాయాల కోసం మరింత సహకారం అవసరమని, భక్తులు విరివిగా విరాళాలు అందించి సహకరించాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు గోవిందు, రామాంజి, గిరి స్వామి, రఘు, వెంకటేష్, పరుశ, నరసప్ప ఉన్నారు.


నగదు అందజేస్తున్న దాత హనుమంతు

వాల్మీకులకు ఎస్టీ హోదా కల్పించాలి



మాట్లాడుతున్న నాయకులు

- బివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అంజన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

వాల్మీకులకు ఎస్టీ హోదా కల్పించాలని బివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అంజన్న డిమాండ్ చేశారు. గురువారం బివిఎస్ నాయకుల ఆధ్వర్యంలో వాల్మీకులు తమను ఎస్టీలుగా పునరుద్ధరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. బివిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు శేఖర్, కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.

వృత్తిని బాధ్యతగా భావించాను

- మున్సిపల్ హైస్కూల్ పీడీ నరసయ్య

ప్రజాశక్తి - ఆదోని



వృత్తిని బాధ్యతగా భావించి చివరి వరకు చిత్తశుద్ధితో వ్యవహరించి ఎంతోమంది విద్యార్థుల బంగారు భవిష్యత్తు బాటలు వేసి ప్రయోజకులను చేశామని మున్సిపల్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్, మాజీ ఎన్‌సిసి ఆఫీసర్ ఎస్.నరసయ్య తెలిపారు. ఈనెల 30న విరమణ పొందుతున్న సందర్భంగా గురువారం ఆయన మాట్లాడారు. పెద్దకడబూరు మండలం నెమలికల్లు గ్రామంలో జులై 1, 1963న అయ్యప్ప, హనుమంతమ్మకు నాలుగో సంతానంగా జన్మించానని తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు నెమలికల్లు గ్రామంలో 6 నుంచి 10 వరకు పెద్దతుంబలం హై స్కూల్‌లో చదివినట్లు చెప్పారు. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు ఆదోని ఆర్ట్స్ కళాశాలలో చదివి ఫిజికల్ ఎడ్యుకేషన్ హైదరాబాదులో పూర్తి చేశామన్నారు. 1991 ఆగస్టు 7న మున్సిపల్ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగంలో చేరామని తెలిపారు. అప్పటి నుంచి ఎన్‌సిసి ఆఫీసర్‌గా ఎంతోమంది విద్యార్థుల శారీరక దృఢత్వం, మానసిక ఎదుగుదలకు తోడ్పడ్డామని చెప్పారు. డిస్ట్రిక్ అథ్లెటిక్స్‌లో జిల్లాస్థాయి టోర్నమెంట్‌లో ఫుట్‌బాల్, క్రికెట్ ఆడి తమ స్కూల్ విద్యార్థులు అప్పట్లోనే 10 వేల బహుమతి పొందారన్నారు. ఎన్‌సిసి పరేడ్ రిపబ్లిక్ డే క్యాంపులో 92లో భీమా అనే విద్యార్థి ఢిల్లీలో గోల్డ్ మెడల్ అందుకున్నారని తెలిపారు. ఆదోని జోనల్ ప్రెసిడెంట్‌గా, స్కూల్ గేమ్స్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించామని చెప్పారు. వికలాంగుల క్రీడలు, కార్మికుల క్రీడా, రెవెన్యూ క్రీడా పోటీలు, స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు, సిఎం కప్ పోటీల నిర్వహణకు కోఆర్డినేటర్‌గా ఉంటూ జోనల్ పోటీలు నిర్వహించామన్నారు. దాతల సహకారంతో క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ విగ్రహం ప్రతిష్టాపన చేశామని తెలిపారు. 1984లో వ్యక్తిగత అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా విద్యార్థులకు మెళకువలు నేర్పించి సైనిక, పోలీసు డిపార్ట్‌మెంట్‌లో చేరే విధంగా ప్రోత్సాహం అందించామని తెలిపారు. భార్య విజయలక్ష్మి, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారన్నారు.

విద్యార్థులే కార్మికులు...

- విద్యార్థులతో పని చేయిస్తున్న హెచ్‌ఎం, పిఇటిలపై చర్యలు చేపట్టాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - నందవరం

నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులే కార్మికులుగా పని చేస్తున్నారని, విద్యార్థులతో పని చేయించిన హెచ్‌ఎం, పిఇటిలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేంద్ర బాబు, ఆర్‌విఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ఖాజా, పిడిఎస్‌ఒ జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్ర బాబు డిమాండ్ చేశారు. గురువారం ఎంఇఒలు రామాంజినేయులు, రఘునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువులు చెప్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులతో పాఠశాల ఆవరణంలో ఉన్న చెట్లకు, గోడలకు పెయింటింగ్ పని చేయించడం దారుణమన్నారు. విద్యార్థులను ఆరా తీయగా తమతో బలవంతంగా హెచ్‌ఎం, పిఇటిలు బలవంతంగా పనులు చేయిస్తున్నారని తెలిపారు. నాయకులు తరుణ్, ధనుష్, ప్రమోద్, సూర్య పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీమఠంలో సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని వైసిపి నాయకులు, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి గురువారం దర్శించుకొన్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. విశ్రాంత తహశీల్దార్ వర్మ, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వార్డు సభ్యులు రామాంజనేయులు, వైసిపి నాయకులు శివ, చెట్నేహళ్లి ఎంపిటిసి రామాంజనేయులు ఉన్నారు.



SUMMONS (Ord. 5 Rule 1 & 5 CPC)
IN THE COURT OF II ADDL. CIVIL JUDGE (Junior Division) ADONI
O.S/ 243 /2021

Between:
N. SHASHIKALA. ...Plaintiff
And
1). B. LAKSHMINARAYANA
2). Smt. B.MADHAVI. ...Defendants
TO
Smt. B. Madhavi W/O. B. Lakshminarayana Teacher, Resident of H.No. 2/7 Buruja Village & Post, Maddikera Mandalam, Kurnool Dist.,

Whereas the Plaintiff has instituted a Suit against you for recovery of the Suit Claim amount. You are hereby summoned to appear in the Court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other persons able to answer all such questions on the **4th July, 2025 at 10.30 AM** in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defiance. Take Summons that, in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
Y. Rami Reddy,
Advocate for Plaintiff
ADONI-518 301